మహాశివరాత్రి మరుసటి రోజు..


సాంబమూర్తికి అస్వస్థతగా ఉండటం వలన ఇంట్లోనే పడుకున్నాడు. అతని భార్య శారద శివాలయానికి వెళ్ళి, ఇంటికి తిరిగొస్తూనే-

"ఏమండోయ్! గుళ్ళో మీ అన్నయ్య కొడుకు గోపాల్ కన్పించాడు. భార్యా పిల్లలతో వచ్చాడు. అబ్బ! వాళ్ళేసుకున్న బట్టలేమిటీ పెట్టుకున్న నగలేమిటీ, కళ్ళు చెదిరిపోయేలా ఉన్నాయి. ఎంతయినా అమెరికా సంతస్థగదా! వాళ్ళ తేజస్సు, అంతస్తు వాళ్ళ మొహాల్లోనే ప్రజ్వరిల్లుతోంది. మా... మనమూ ఉన్నాం, ఎన్నేళ్ళయినా పుట్టుడుకి రెండెక్కువ, దాపుడుకి ఒకటి తక్కువ."

భార్య మాటలకి పక్కకి తిరిగి పడుకున్నాడు సాంబమూర్తి. చేతిలో ఉన్న పూలసజ్జ టేబిల్ మీదుంచి, మళ్ళీ తన ధోరణి మొదలెట్టింది శారద.

"ఆ... చెప్పటం మరిచాను. మనం అంతకుముందు అద్దెకున్న ఇంటావిడ యశోదమ్మ గుళ్ళో కన్పించింది. ఎంత విడ్డూరమో చూశారా! ఎవడ్నో చేసుకుని లేచెళ్ళిపోయిన ఆవిడ పెద్దకూతురు ఝాన్సీ, భర్తని వెంటేసుకుని తగుదునమ్మా అంటూ గుడికి వచ్చింది. వాళ్ళిద్దరితో బాటు యశోదమ్మా, ఆమె భర్తా కూడా వచ్చారు.

ఆ పిల్లాడిది ఏం కులమో, గోత్రమో గానీ తెల్లని ఝాన్సీ పక్కన నీలమేఘశ్యాముడిలా ఉన్నాడు. కూతురు లేచెళ్ళగానే యశోదమ్మ భర్త కూతురికి తర్పణాలొదిలాననీ, తనకి కూతురే పుట్టలేదనీ బీరాలు పలికారా? ఇవ్వాళ అంతా ఏకమయ్యారు గాబోలు. కాకేం చేస్తారండి. ఝాన్సీ భర్తకి దుబాయ్‌లో ఉద్యోగం దొరికిందట. గుళ్ళో నేను కన్పించగానే, మా అల్లుడు అని యశోదమ్మ చెప్తోంటే నాకు వళ్ళు కంపరం పుట్టిందనుకోండి."




సాంబమూర్తి బలవంతంగా కళ్ళు మూసుకుని మౌనంగా భార్య మాటలు ఆలకిస్తున్నాడు.

"వాళ్ళని తప్పించుకుని కాస్త ముందుకు వెళ్ళే సరికి మీ ఫ్రెండ్ సత్యమూర్తి భార్య సుశీల పిల్లలతో కన్పించింది. నన్ను గుర్తుబట్టి వదల్లేదంటే నమ్మండి. అయినా ఆ సత్యమూర్తికేం పోయేకాలమండీ! ఇద్దరు ఎదిగిన పిల్లల తండ్రి అయుండీ, ఆఫీసులో పన్జేస్తున్న స్టెనో ఎవత్తెతోనో చిన్నిల్లు సెటప్ చేశాట్ట. అదేమని అడిగితే, ఇంటికి రానని బెదిరిస్తున్నాట్ట. పాపం! సుశీల వెక్కిళ్ళు పెట్టి మొహం ఉబ్బిపోయేలా ఏడ్చింది."

ఆమె చెబుతున్న ఏ విషయానికీ భర్త నుండి ఏ విధమైన స్పందన కన్పించకపోయేసరికి, లోపలికెళ్ళి రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి, భర్తకిచ్చి, తనూ తాగుతూ..

"గుళ్ళో మన పాత పాలవాడు మాధవయ్య కన్పించి నన్ను గుర్తుబట్టి పలకరించాడు. వాణ్ణసలు పోల్చుకోలేకపోయాను. ఇల్లిల్లూ తిరిగి పాలమ్ముకునే మాధవయ్య ఇపుడు మారుతీ కారు కొన్నాట్ట. పాల వ్యాపారం మాని, అపార్ట్‌మెంట్లు కట్టించి అమ్ముతున్నాట్ట. మీ దగ్గర పాత సైకిల్ తీసుకుని పాలమ్ముకున్న మాధవయ్య, ఇవ్వాళ మారుతీ కారు స్థాయికి ఎదిగాడంటే తెలివితేటలండీ! మనమూ ఉన్నాం ఎన్నేళ్ళయినా ఇవే అద్దె కొంపలూ, ఎదుగూ బొదుగూ లేని అడ్జస్ట్‌మెంట్ల జీవితం" అంది.

సాంబమూర్తి కాఫీ తాగి మళ్ళీ పడుకున్నాడు.

శారద మళ్ళీ ఏదో చెప్పబోయేంతలో, కూతురు సుమ కాలేజీ నుండి వస్తూనే, "అమ్మా! ఆకలి దంచేస్తోంది. త్వరగా అన్నం పెట్టమ్మా!" అంది.

"ఉండవే! దేవుడికి మహానివేదన పెట్టి పెడ్తాను" అని లేవబోతుంటే, సాంబమూర్తి లేచి కూచుని-

"గుళ్ళో ఎంతోమందిని కలిశావుగదా! అసలాయన్ని చూశావా?"

"అసలాయనా?! ఆయనెవరండీ?"

"మహాశివుడు"

"హయ్యో! అంత భాగ్యమా! ఊళ్ళో జనమంతా గుళ్ళోనే ఉన్నారు. ఆ క్యూలు దాటుకుంటూ వెళ్ళాలంటే సాయంత్రం దాటుతుంది. నిన్నంతా ఉపవాసం, రాత్రంతా జాగారం చేశావా! కాళ్ళు గుంజుతుంటే, పుణ్యం సంగతి దేవుడే చూసుకుంటాడని, బయట్నుంచే ఓ దణ్ణం పెట్టుకుని తిరిగొచ్చాను" అని మహానివేదన పెట్టడానికి లోపలికెళ్తున్న భార్యవైపు జాలిగా చూశాడు సాంబమూర్తి.

-ఎం.వెంకటేశ్వరరావు(సికింద్రాబాద్)

